నయీంనగర్ అట్టుడికింది!

వరంగల్ నగరం మరోసారి రాజకీయ విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలకు వేదికైంది. కాంగ్రెస్, భారాస శ్రేణుల తోపులాటలతో కీలకమైన నయీంనగర్ ప్రాంతం అట్టుడికింది. అభివృద్ధిపై ఇరుపార్టీల నేతలు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. హనుమకొండ నయీంనగర్ వంతెన, నాలా అభివృద్ధి పనులపై కాంగ్రెస్, భారాస నేతలు పరస్పర విమర్శలు గుప్పించుకోవడంతో నయీంనగర్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. - నయీంనగర్, న్యూస్‌టుడే

- గంటకుపైగా ఉద్రిక్తతతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి
- కాంగ్రెస్, భారాస పరస్పర ఆరోపణలు


భారాస-కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట

అసలేం జరిగిందంటే..

వరంగల్ నగరం అభివృద్ధిపై సోమవారం నయీంనగర్ వద్ద ప్రెస్‌మీట్ నిర్వహిస్తామని భారాస, కాంగ్రెస్ నాయకులు సమాచారం ఇచ్చారు. దీంతో రెండు పార్టీల మధ్య ఘర్షణ తలెత్తకుండా పోలీసులు జాగ్రత్తపడ్డారు. మొదట భారాస నేతలకు అవకాశం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు సమావేశం పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కాంగ్రెస్ నేతలకు అవకాశం ఇచ్చారు. భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ పార్టీ శ్రేణులతో కలిసి నయీంనగర్ వంతెన వద్దకు చేరుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలోనే వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామన్నారు. కొంతమంది తమ స్వార్థం కోసం విమర్శలు చేస్తున్నట్లు ఆరోపించారు. అంతలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అడ్డువచ్చిన పోలీసులను సైతం నెట్టేశారు. దీంతో డీసీపీ ఎస్ఎం.సలీమా, ఏసీపీ దేవేందర్‌రెడ్డి ప్రత్యేక బృందాలతో అక్కడికి చేరుకుని ఇరువర్గాల నేతలను సముదాయించారు. కేటాయించిన సమయం ముగిసినందున ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని భారాస నేతలకు సూచించారు. దీంతో అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని గులాబీ నేతలు మండిపడ్డారు. వినయ్‌భాస్కర్‌తో పాటు పార్టీ శ్రేణులు హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ ఆందోళన గంటకుపైగా జరగడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వారిని అరెస్టు చేసి ఠాణాకు తరలించారు.

30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి వారిని చూడలేదు

తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి గుండాలను చూడలేదని మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హనుమకొండ భారాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'అధికారం ఉందని శిలాఫలకాలు పగులకొట్టి, పోలీసులతో అరెస్టు చేయించడం అవివేకం' అన్నారు. కేటీఆర్ నీకు పోలిక అని ఎద్దేవా చేశారు. కొన్ని నెలలు సమయం ఇద్దామనుకున్నాం.. టార్గెట్ చేసి మాట్లాడుతున్నావు.. ఇది సరికాదన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతానని స్పష్టం చేశారు. అరెస్టు చేయించి నగరమంతా తిప్పారు. రాజేందర్‌రెడ్డికి చిత్తశుద్ధి, డిమాండ్ చేస్తున్నా 'పెద్దమ్మగడ్డలో కాల్వగన సమాధులను 48 గంటల్లో తిరిగి కట్టించాలి.. నాపై విమర్శలు చేసే వారి విజ్ఞతకే వదిలేస్తున్నా, రెచ్చగొట్టే చర్యలు వద్దు' అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ ఛైర్మన్ యాదవరెడ్డి, సుందర్‌రాజ్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వినయ్‌భాస్కర్, సుందర్‌రాజ్ తదితరులను అరెస్ట్ చేసి ఠాణాకు తరలిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

కమీషన్ల కోసం అభివృద్ధిని విస్మరించారు..

గత భారాస ప్రభుత్వం కమీషన్ల కోసం కక్కుర్తిపడి ప్రజా సంక్షేమం, నగరాభివృద్ధిని విస్మరించిందని మహా నగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి ఆరోపించారు. ఆందోళన అనంతరం నయీంనగర్ నాలా వద్ద విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భారీ వర్షాల సమయంలో నగర ప్రజలను పట్టించుకోలేదని మండిపడ్డారు. వంతెన, నాలా అభివృద్ధికి 2002లో టెండర్ పూర్తయితే నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై సమాధానం చెప్పాలన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సీఎం రేవంత్‌రెడ్డికి నాలా పరిస్థితి వివరించినట్లు తెలిపారు. 9 నెలల కాలంలో కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి నగర ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ నిధులు వెనక్కి పోకుండా నగరాభివృద్ధికి పూర్తి స్థాయిలో వినియోగించామన్నారు. సమావేశంలో తోట వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారాన్ని అందించాలని జిల్లా పాలనాధికారి డా. సత్యశారద సూచించారు. సోమవారం ఖిలావరంగల్ పడమరకోటలోని ఓ వేడుకల మందిరంలో ఏర్పాటు చేసిన పోషణ మాసం ముగింపు వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరిస్తున్న క్రమంలో ప్రజలు భాగస్వాములై తోడ్పాటు అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషణ మాసాన్ని పురస్కరించుకొని జిల్లాలో 4.80 లక్షల మందితో 919 అంగన్‌వాడీ కేంద్రాల్లో 40 వేల కార్యక్రమాలు చేసినట్లు పోషణ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ కార్తీక్ తెలిపారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు, అన్నప్రాసన నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, పోశాల పద్మ, గుండు చందన, పల్లం పద్మ, ఐసీడీఎస్ ప్రాజెక్టు వరంగల్, వర్ధన్నపేట సీడీపీవోలు విద్య, డెబోరా, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో హేమలత, ఖిలావరంగల్ సెక్టార్ సూపర్‌వైజర్ కల్యాణి, జిల్లా సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, లబ్ధిదారులు, బాలింతలు పాల్గొన్నారు.


చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న పాలనాధికారి సత్యశారద చిత్రంలో కార్పొరేటర్లు

భువన్ సర్వే వేగవంతం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్ పరిధిలో ఆస్తి పన్ను అసెస్‌మెంట్ల భువన్ యాప్ సర్వే ముమ్మరం చేశామని కమిషనర్ డా.అశ్విని తానాజీ తెలిపారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు వీపీ.గౌతమ్ హైదరాబాద్ నుంచి మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. భువన్ సర్వే, స్వచ్ఛతా హీ సేవా, ఏపీసీ కేంద్రాల నిర్వహణ, డీఆర్‌సీ సెంటర్లు, ఇంటింటా చెత్త సేకరణ, డెంగీ, కాలానుగుణ వ్యాధుల నివారణ, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. సీఎంహెచ్‌వో డా.రాజేష్, బయాలజిస్టు మాధవరెడ్డి, హెచ్‌వో రమేశ్, పన్నుల శాఖ అధికారి బిర్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హనుమకొండ అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సోమవారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉత్సాహంగా జరిగాయి. పోటీలకు హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన అథ్లెట్లు బరిలో దిగారు. వివిధ క్రీడాంశాల్లో అండర్-14, 16, 18, 20 విభాగాల్లో జరిగిన పోటీలకు అథ్లెట్లు విజయం కోసం చెమటోడ్చారు. ముఖ్యఅతిథిగా టాస్క్‌ఫోర్సు సీఐ రాజు హాజరై పోటీలను ప్రారంభించారు. ఎంపికైన అథ్లెట్లు అక్టోబరు 26 నుంచి 29 వరకు భువనేశ్వర్‌లో జరిగే జూనియర్ నేషనల్స్ ఛాంపియన్‌షిప్-2024లో పాల్గొంటారని హనుమకొండ అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి తెలిపారు. వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి యుగేంధర్‌రెడ్డి, మనోజ్‌కుమార్, శ్రీమన్నారాయణ, సాంబమూర్తి, కృష్ణమూర్తి, మహేందర్, సురేష్ పాల్గొన్నారు.

కష్టేఫలి..!

డీఎస్సీలో మెరిశారు.. అనుకున్నది సాధించారు!

'డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం నుంచి ఉంటుంది. సరైన ధ్రువపత్రాలతో హాజరుకావాలి. పూర్తి వివరాలకు హనుమకొండలోని డైట్ కళాశాలలో సంప్రదించాలి'

కల నెరవేరింది.. కష్టానికి ఫలితం దక్కింది. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎన్నో ఏళ్లుగా వీరు ఎదురుచూశారు. ఇతర అవకాశాలు ఉన్నా కాదనుకున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడంతో దీక్షగా చదివి చివరికి అనుకున్నది సాధించారు. ప్రభుత్వం సోమవారం వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో సబ్జెక్టుల వారీగా జిల్లాల్లో మొదటి, రెండో ర్యాంకులు సాధించినవారి స్ఫూర్తిదాయక కథనం..

- న్యూస్‌టుడే యంత్రాంగం, ఎన్జీవోస్‌కాలనీ



నెక్కొండకు చెందిన మేడి నాగరాజు డీఎస్సీ (తెలుగు లాంగ్వేజ్ పండిట్)లో మహబూబాబాద్ జిల్లాలో 70.17 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. నిరుపేద కుటుంబానికి చెందిన నాగరాజు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు. - నెక్కొండ, న్యూస్‌టుడే

పీడీ, పీఈటీ సైతం..



వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయికి చెందిన నేతుల రాజు డీఎస్సీలో ప్రథమ ర్యాంకు సాధించి ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. - సంగెం



- ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన పోతుగంటి వెంకటేశ్వర్లు (స్కూల్ అసిస్టెంటు) ఆంగ్లం విభాగంలో నాలుగో ర్యాంకు, సాంఘికశాస్త్రం విభాగంలో ఏడో ర్యాంకు సాధించారు. ఆయన ప్రస్తుతం ఓ విద్యాసంస్థలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పేద కుటుంబానికి చెందిన ఆయన తల్లిదండ్రులు వడ్రంగి పనిచేస్తూ ఆయనను చదివించారు. - ఖానాపురం, న్యూస్‌టుడే



- వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన మర్రి రాజేశ్ ప్రత్యేక డీఎస్సీ (ఐఈడీ) జనరల్ కేటగిరీలో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. మధ్య తరగతి కుటుంబానికి చెందిన మర్రి సుజాత, లక్ష్మీనారాయణ తల్లిదండ్రులు. తండ్రి 14 ఏళ్ల క్రితం మృతి చెందగా సుజాత పిల్లలను కష్టపడి చదివించింది. - నర్సంపేట, చెన్నారావుపేట

దంపతులు సాధించారు



- వరంగల్ జిల్లా నల్లబెల్లికి చెందిన కొండ్లె నాగలక్ష్మి, వినయ్ దంపతులు డీఎస్సీలో ప్రతిభ చాటారు. వినయ్ జిల్లాస్థాయిలో ఏడో ర్యాంకు, నాగలక్ష్మి 54వ ర్యాంకు సాధించారు.



- నల్లబెల్లికి చెందిన మూటికె ప్రవళిక 83.20 మార్కులతో జిల్లాస్థాయిలో రెండో ర్యాంకు సాధించి సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుకు ఎంపికయ్యారు. రాజిత, రాజులు ఆమె తల్లిదండ్రులు. వారిది వ్యవసాయ కుటుంబం. - నల్లబెల్లి

ఒకేసారి మూడు ఉద్యోగాలు..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గిద్దెముత్తారం గ్రామానికి చెందిన మామిడి మహేశ్ మూడు ఉద్యోగాలు సాధించి మురిపించారు. తెలుగు పండిట్ విభాగంలో 80.90 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 76.40 మార్కులతో జిల్లా మూడో ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో 73.40 మార్కులతో జిల్లా ఐదో ర్యాంకు సాధించారు. మహేశ్ ప్రస్తుతం ప్రభుత్వ గురుకుల టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి సమ్మయ్య, కుటుంబ సభ్యులు, గురువుల ప్రోత్సాహంతో మంచి ఫలితం సాధించేందుకు కారణమైందని ఆయన చెప్పారు. - చిట్యాల

ఉద్యోగం వదులుకొని సన్నద్ధం



ఖానాపురం మండలం రాగంపేట గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన ఎలగందుల శ్వేత మొదటి ర్యాంకు సాధించారు. ప్రస్తుతం హనుమకొండ వికాస్‌నగర్‌లో ఉంటున్న ఆమె బీఎస్సీ, డీఈడీ చదివారు. ఎస్జీటీ విభాగంలో 100 మార్కులకు గాను 83.37 మార్కులు సాధించారు. గతంలో నల్లబెల్లి మండలంలో పంచాయితీ కార్యదర్శి ఉద్యోగం సాధించిన ఆమె.. ఆ ఉద్యోగం వదులుకొని ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న ఆసక్తితో డీఎస్సీ రాశారు. భర్త శ్రీకాంత్ ఎన్నైగా పనిచేస్తున్నారు. - రంగశాయిపేట, ఖానాపురం



- వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్‌కు చెందిన జగతి సంపత్ డీఎస్సీ స్కూల్ అసిస్టెంటు (సాంఘికశాస్త్రం) విభాగంలో రెండో ర్యాంకు సాధించారు. ఆయన ప్రస్తుతం వరంగల్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంటు రైటర్‌గా పని చేస్తున్నారు. - ఖానాపురం



- వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఎండీ ఫర్జాన స్కూల్ అసిస్టెంట్ హిందీ విభాగంలో 65.67 మార్కులు సాధించారు. సిద్దిపేట జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. రెండు నెలల క్రితం హిందీ విభాగంలో జేఎల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. - దుగ్గొండి

కష్టాలు ఎదుర్కొని..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఒడిపిలవంచ గ్రామానికి చెందిన గడ్డం ఫణిందర్ జిల్లా 3వ ర్యాంకు సాధించాడు. తండ్రి వైకుంఠం ఏడాది కిందట మృతి చెందగా తల్లి పద్మ గ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది డిసెంబరులో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నియామకాల్లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగం సాధించాడు. డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో ఉద్యోగానికి సెలవు పెట్టి పట్టుదలతో చదివి ర్యాంకు సాధించాడు. గ్రూప్-4లోనూ జిల్లాలో 13వ ర్యాంకు తెచ్చుకున్నారు. - కాటారం

- మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని దుబ్బతండాకు చెందిన గుగులోతు నిఖిల్ స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ విభాగంలో జిల్లా ప్రథమర్యాంక్ సాధించారు. ప్రస్తుతం పెద్దవంగర మహాత్మాజ్యోతిబాపులే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. - తొర్రూరు

కుమారుడి నుంచి రక్షణ కల్పించండి

సంగెం,న్యూస్‌టుడే: ఆస్తి కోసం వేధిస్తున్న కుమారుడి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం వృద్ధ దంపతులు సంగెం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వివరాలివి.. సంగెం మండలం నల్లబెల్లి శివారులోని కొత్తపల్లెకు చెందిన కూస కొమురయ్య-సుభద్ర దంపతులకు ఒక కుమారుడు రవి, కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలయ్యాయి. తల్లిదండ్రులకు 8 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో 6 ఎకరాలను కుమారుడి పేరిట పట్టా చేశారు. తమ కోసం 2 ఎకరాల భూమిని ఉంచుకున్నారు. 2 ఎకరాల భూమిని తనకు ఇవ్వాలంటూ రవి, కోడలు స్వరూప, మనవడు పరమేశ్‌లు గతంలో వృద్ధులపై దాడి చేసి గాయపరిచారు. వృద్ధులు ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం గత నెల 28న కలెక్టర్‌ను ఆశ్రయించారు. తమ కుమారుడి నుంచి ప్రాణ భయం ఉందని, రక్షణ కల్పించాలని ఫిర్యాదు చేశారు. బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను ఆదేశించారు. దీంతో సోమవారం వృద్ధ దంపతులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. మంగళవారం రవి కుటుంబ సభ్యులను పిలిపించి కొమురయ్య దంపతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.


ఫిర్యాదు పత్రాలను చూపిస్తున్న వృద్ధ దంపతులు

నేడు సీపీఐ సదస్సు

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: పేదల ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఎల్బీనగర్‌లో మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) సదస్సు నిర్వహించనుంది. స్థానిక అబ్బాస్ వేడుకల మందిరంలో జరగనున్న సదస్సుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఏర్పాట్లను సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు.

అలరించిన కళార్చన

విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల నెలవారీ కళార్చన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. సోమవారం సాయంత్రం వరంగల్ పోతన విజ్ఞానపీఠం ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమాన్ని భారతరత్న, ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్.సుబ్బులక్ష్మికి అంకితం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ సుధీర్‌కుమార్ జ్యోతి వెలిగించి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు. మృదంగం, హిందుస్థానీ గాత్రం, సితార్, కర్ణాటక గాత్రం, వయోలిన్, కూచిపూడి, పేరిణి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు ఏడిద భీమశంకర్, అనుముల యోష, జక్కోజు సత్యనారాయణ, సింగారపు భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ గడ్డం శంకర్, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, రామన్నపేట



మార్కెట్‌కు పోటెత్తిన పత్తి..!

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు క్రమంగా పత్తి పోటెత్తుతోంది. గత వారం వరకు ప్రతి రోజు 5 వేలు మించని పత్తి బస్తాలు సోమవారం సుమారు 9 వేల వరకు వచ్చాయి. సోమవారం కొత్త పత్తికి క్వింటా గరిష్ఠ ధర రూ. 6,910, కనిష్ఠ ధర రూ.5 వేలు పలికింది. మంగళవారం నుంచి ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ.500 పెరగనుంది. సోమవారం వరకు క్వింటాకు రూ.7,021 ఉన్న ధర.. మంగళవారం నుంచి క్వింటాకు రూ. 7,521 కానుంది. సీసీఐ టెండర్లు పూర్తయిన వెంటనే.. నోటిఫై చేసిన మిల్లుల్లో మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేయనున్నారు.

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు గ్రేటర్ వరంగల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం బల్దియా సమావేశ మందిరంలో అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులతో సమావేశమయ్యారు. నగరంలోని 66 డివిజన్లలో పండగల నేపథ్యంలో చేయాల్సిన పనులను అడిగి తెలుసుకున్నారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. చెరువులు, కుంటలు, మైదానాల వద్ద కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. దేశాయిపేట చిన్న వడ్డెపల్లి, ఉర్సు రంగసముద్రం, శివనగర్ తదితర ప్రాంతాల్లో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కమిషనర్ డా.అశ్విని తానాజీ, అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఉప కమిషనర్లు, ఎస్ఈలు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ మరమ్మతులు ముమ్మరం

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేట-ఇల్లంద గ్రామాల మధ్య ఆకేరు వాగుపై ఉన్న చెక్‌డ్యామ్ మరమ్మతులు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గతేడాది వరదలకు కోతకు గురైన వైనంపై 'చెక్‌డ్యామ్‌కు కోత.. మరమ్మతులు సాగదీత!' అనే శీర్షికన సోమవారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాలతో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలకుర్తి సారంగపాణి పనుల్లో వేగం పెంచారు. కోతకు గురైన ప్రాంతాన్ని సోమవారం రాళ్లు, మట్టితో నింపి కట్టపోశారు. మరో మూడు రోజుల్లో పనులు పూర్తి చేసి నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్ధన్నపేట, ఇల్లంద, గ్రామాల రైతులు, పట్టణప్రజలకు నీటి కష్టాలు లేకుండా చూస్తామన్నారు.


పర్యవేక్షిస్తున్న జడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలకుర్తి సారంగపాణి

ఈనాడు కథనానికి స్పందన



రైతు బంధు, కౌలు డబ్బులు వచ్చేలా చేశారు

ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన ఈయన పేరు మామిడిశెట్టి చిన్న మల్లయ్య.. ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు చేసి ఇళ్ల స్థలాలు, భూములు పంచి ఎకరం భూమిని తమ పోషణ నిమిత్తం ఉంచుకున్నారు. ఆ భూమి పొరపాటున పెద్ద కొడుకు రాజు పేరున పాస్‌బుక్‌లో నమోదైంది. దీంతో రైతుబంధు పెద్దకుమారుడికే చెందుతోంది. తండ్రి తన పోషణ నిమిత్తం ఉంచుకున్న భూమిని చిన్న కుమారుడు కౌలుకు చేస్తూ కౌలు డబ్బులు తండ్రికి ఇవ్వడం లేదు. దీంతో మామిడిశెట్టి చిన మల్లయ్య ములుగు ఆర్డీవో సత్యపాల్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారి చట్ట ప్రకారం నోటీసులు జారీ చేశారు. తహసీల్దారు విచారణ జరిపి ఆర్డీవోకు నివేదిక సమర్పించారు. ఇరువురి వాదనలు విన్న ఆర్డీవో మల్లయ్య భూమి అర్జీదారు పేరిట నమోదు చేయడానికి సెప్టెంబరు 9న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రైతు బంధు, కౌలు డబ్బులు అర్జీదారుకు చెందేలా మార్గం సుగమమైంది.

ప్రతి నెలా రూ.2 వేలు చెల్లించాలి




వెంకటాపురం మండలం నల్లగుంట గ్రామానికి చెందిన గోడిశాల సమ్మక్కకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కొడుకు ఉద్యోగరీత్యా హనుమకొండలో ఉంటున్నారు. ఊళ్లో ఆయనకు పంచి ఇచ్చిన ఇంట్లో సమ్మక్క నివాసం ఉంటోంది. చిన్న కొడుకు మరణించిన తర్వాత కోడలు ఆ ఇంట్లో సమ్మక్కను ఉండనివ్వడం లేదు. పెద్ద కుమారుని వాటా కూడా తమకే చెందుతుందని గొడవ పడింది. దీంతో వేరే ఇంట్లో నివాసం ఉంటున్నానని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇరువురికి నోటీసులు జారీ చేశారు. వాదనలు విన్న అనంతరం పెద్ద కుమారుడి వాటాగా ఉన్న ఇంటిలో సమ్మక్క నివాసం ఉండేలా, ఆమె జీవనానికి పెద్ద కుమారుడు రవిందర్, చిన్న కోడలు శ్రీలత నెలకు రూ.2 వేలు ఇవ్వాలని ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి ఆదేశిస్తూ సెప్టెంబరు 19న ఉత్తర్వులు జారీ చేశారు.

పిల్లలను పెంచి.. పెద్దచేసిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో నిరాదరణకు గురవుతున్నారు.. దీంతో ముదిమి వయసులో క్షోభ అనుభవిస్తున్నారు.. బతుకుమార్గం చూపిన అమ్మానాన్నలకు కంటికిరెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క రిపై ఉంది.. చట్టపరంగా వృద్ధులకు హక్కులు ఉన్నాయి.. నిరాదరణకు గురవుతున్న సందర్భాల్లో న్యాయస్థానాలు అండగా ఉంటున్నాయి.. మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

'వయోవృద్ధులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా టోల్‌ఫ్రీ 14567 నంబరును సంప్రదించాలి.'

పోషణ చట్టం.. వృద్ధులకు పట్టం

న్యూస్‌టుడే– హనుమకొండ కలెక్టరేట్, గిర్మాజీపేట, ములుగు



అండగా చట్టాలు..

తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణభారం, సంరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి.. హిందూ దత్తత, పోషణ చట్టం-1956 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రేమతో కేసులు వేయడం లేదు. దీంతో వేగవంతమైన సహాయాన్ని అందించేందుకు న్యాయ స్థానాలతో సంబంధం లేకుండా తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం- 2007ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. తెలంగాణ ప్రభుత్వం సవరణ నియమావళి-2022ను రూపొందించింది.

దరఖాస్తు ఎవరికి సమర్పించాలి..?

వృద్ధులు, తల్లిదండ్రులు ఎక్కడ నివసిస్తున్నారో, ఇంతకుముందు చివరిసారిగా ఎక్కడ నివసించారో తెలుపుతూ వారి పిల్లలు లేదా బంధువులు ఎక్కడ నివసిస్తారో.. తెలుపుతూ ఆయా జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారి(మెయింటనెన్స్ ట్రిబ్యునల్), జిల్లా సంక్షేమాధికారికి పోషణ ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకోవాలి.

90 రోజుల్లో విచారణ

వయోవృద్ధులు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల వ్యవధిలో ట్రైబ్యునల్ పిల్లలకు నోటీసులు పంపించి విచారణాధికారులచే వాదనలు, సాక్ష్యాలు సేకరించి పోషణ ఖర్చుల చెల్లింపునకు ఆదేశిస్తుంది.. మూడు నెలల పాటు సదరు పిల్లలు పోషణ ఖర్చులు ఇవ్వకపోతే తల్లిదండ్రులు తిరిగి ట్రైబ్యునల్‌ను ఆశ్రయించొచ్చు. ఉత్తర్వులు పాటించని పిల్లలు, బంధువులకు జరిమానా, జైలు శిక్ష విధించే హక్కు దానికి ఉంటుంది. పిల్లలు, బంధువులు పోషణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తిరిగి వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కు ఉంటుంది.

☛ నడవలేని వయోవృద్ధులకు వీల్‌చైర్స్, చేతి కర్రలు, ఇతర పరికరాలు, వినికిడి యంత్రాలు, కళ్లజోడులు అందజేస్తారు. వృద్ధులు జిల్లా సంక్షేమాధికారికి దరఖాస్తు చేసుకోవాలి. వృద్ధాప్యంలోని తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే.. పిల్లలతో ఇబ్బందులు ఎదురైతే జిల్లా సంక్షేమాధికార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా ఇన్‌ఛార్జి సంక్షేమాధికారిణి రాజమణి తెలిపారు.

ఆశ్రమాల్లో ఆదరణ..

నిరాదరణకు గురైన వృద్ధులకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనాథాశ్రమాల్లో సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 వృద్ధాశ్రమాలు ఉండగా అందులో సుమారు 474 మంది ఉంటున్నారు.

జిల్లా	ఆశ్రమాలు	వృద్ధుల సంఖ్య
హనుమకొండ	10	252
వరంగల్	05	154
జనగామ	02	30
మహబూబాబాద్	01	12
భూపాలపల్లి	01	10
ములుగు	01	16



నగరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..

-తేరాల యుగంధర్, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ కార్యదర్శి



2018లో మేం వయోవృద్ధుల సంక్షేమ సంఘాన్ని స్థాపించాం. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్నారు. చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. లయన్స్ క్లబ్ సహకారంతో కంటి వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. మా పోరాటం వల్లే ఎంజీఎం ఆసుపత్రిలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఓపీ విభాగం ఏర్పాటు చేశారు.



టోల్‌ఫ్రీ నంబరుపై వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు (పాత చిత్రం)

కనీసం తిండి పెట్టకుండా..



స్టాండు సాయంతో మెట్లు దిగుతున్న ఈ వృద్ధుడి పేరు వేల్పుల నర్సయ్య వయసు 90 ఏళ్లు.. సంగెం మండలం గవిచర్ల నివాసి.. భార్య ఆగమ్మ అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమయ్యారు. తన నాలుగెకరాల భూమిలో 2.5 ఎకరాలను కుమారుడు అక్రమంగా పట్టా చేసుకున్నాడు. మిగిలిన భూమి చెరువు శిఖం కింద ఉంది. గతంలో ఇద్దరు కుమార్తెలకు పసుపు, కుంకుమ కింద 10 గుంటల చొప్పున రాసిచ్చాడు. ఆ భూమిపై కన్నేసిన కుమారుడు తన పేరుపై రాసివ్వాలని ఒత్తిడి తెస్తూ.. తల్లిదండ్రులైన ఇద్దరు వృద్ధులను ఓ చిన్న గదిలో ఉంచి తిండి పెట్టడంలేదు. ఇష్టమొచ్చినట్లు కొడుతున్నాడని కన్నీటి పర్యంతమయ్యారు. తన బాధను గత జులైలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

గిఫ్ట్ డీడ్ రద్దు చేసి..

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పైడిచింతలపల్లి గ్రామానికి చెందిన గడ్డం బాపురెడ్డి కుమారుడైన స్వామిరెడ్డికి 6.5 ఎకరాలను గిఫ్ట్ డీడ్ చేశారు. కాగా, వృద్ధాప్యంలో బాగోగులు చూడడం లేదని.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కుమారుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో గిఫ్ట్ డీడ్‌ను రద్దుచేయాలని గత ఆగస్టులో దరఖాస్తు చేశారు. కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి గిఫ్ట్‌డీడ్‌ను రద్దుచేసి తిరిగి తండ్రి పేరిట భూమిని బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. తండ్రి పోషణకు ప్రతి నెలా రూ.10 వేలు చెల్లించాలని కుమారుడిని ఆదేశించారు.

అవార్డుల స్ఫూర్తితో అభివృద్ధి




మేయర్ సుధారాణికి ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్మార్ట్‌సిటీ, నైబర్ హుడ్ ఛాలెంజ్ పోటీల్లో గ్రేటర్ వరంగల్‌కు అవార్డులు రావడం గర్వకారణమని, ఇదే స్ఫూర్తితో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఇటీవల కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ ఇచ్చిన 'ఎక్సలెన్స్' ధ్రువపత్రాన్ని సోమవారం రాత్రి బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులు మేయర్‌కు అందజేశారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈలు కృష్ణమోహన్, కృష్ణమూర్తి, రంగారావు, ఏఈలు పాల్గొన్నారు.

యువ పరిశోధకులకు ప్రోత్సాహం



ప్రభాకర్



నరేంద్రకుమార్

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మిరప పంటను ఆశిస్తున్న నల్లతామర తెగులు నివారణకు పరిశోధనలు చేసి సేంద్రియ ఆధారిత మందులు తయారుచేసిన యువ పరిశోధకులను తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ద్వారా ప్రభుత్వం అందించే రూ.5 లక్షల టీ-స్పార్క్ గ్రాంట్ వరించింది. వివిధ రంగాల్లో పరిశోధనలు చేస్తున్న వారి నుంచి 2024 ఆగస్టులో అంతర్జాలం ద్వారా ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి యువకుడు గాజుల ప్రభాకర్, డోర్నకల్ యువకుడు నరేంద్రకుమార్ ఓయూలో ఎంఎస్సీ పీహెచ్‌డీ పూర్తి చేసి శ్రీజీపీఎవెన్ లైఫ్ సైన్సెస్ అనే స్టార్టప్ సంస్థను స్థాపించి పంటలపై ఆశించే పురుగు, తెగుళ్ల నివారణకు పరిశోధనలు చేస్తున్నారు. హైదరాబాద్ ఐకేపీ నాలెడ్జ్ పార్క్ సహాయంతో త్రిప్ క్లియర్ అనే సేంద్రియ ఆధారిత పురుగు మందు రూపొందించారు. టీ-స్పార్క్ వారు పలుమార్లు పరిశీలించి గ్రాంట్‌కు తమ సంస్థను ఎంపిక చేశారని ప్రభాకర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. తమ ఉత్పత్తిని త్వరలో మార్కెట్లోకి తీసుకురానున్నట్లు వారు వివరించారు.

కాలుష్యపు కోరల్లో.. మంచినీళ్ల చెరువు



రైతు బాలయ్య కుడి చేతి సీసాలో స్వచ్ఛమైన నీరు.. ఎడమచేతిలో కలుషితమైన చెరువు నీరు

వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రం శివారులోని 'మంచినీళ్ల చెరువు' కాకతీయుల కాలం నుంచి గ్రామ ప్రజలకు తాగునీటి వరప్రదాయిని. పంట పొలాలకు సాగు నీరు అందించే ప్రధాన జలవనరు. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన తాటాకం నేడు కోళ్ల పరిశ్రమ వ్యర్థాలతో కాలుష్య కాసారంగా మారింది. సుమారు 115 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 120 మత్స్యకార కుటుంబాలు ఈ చెరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. పదేళ్ల క్రితం వరకు చెరువులో నాణెం వేసినా స్పష్టంగా కనపడేదని స్థానికులు తెలిపారు. తొమ్మిదేళ్ల క్రితం కోళ్ల పరిశ్రమ వెలిసినప్పటి నుంచి మంచినీళ్ల చెరువు కాలుష్యపు కోరల్లో చిక్కుకుంది. పశుపక్ష్యాదులు సైతం ఈ నీటిని తాగలేని పరిస్థితి. గ్రామానికి మంచి నీటిని సరఫరా చేసే బోరు బావులు చెరువులోనే ఉండటంతో.. ఈ నీటిని తాగిన వారు జబ్బుల బారిన పడుతున్నారు. స్నానపానాదులకు ఈ నీటిని వాడినా.. చర్మవ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. కోళ్ల పరిశ్రమ నిర్వాహకులు ఓ కాలువ ద్వారా అర్ధరాత్రి వ్యర్థాలను చెరువులో వదులుతున్నారు. దీనిపై గ్రామస్థులు ఉద్యమం ప్రారంభించారు. గ్రామ పరిరక్షణ కమిటీ పేరిట అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ గోడు చెబుతున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో పాలనాధికారి డా.సత్యశారదను కలిసి సమస్య విన్నవించారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే రాయపర్తి



వరంగల్ కలెక్టరేట్ ఎదుట రాయపర్తి గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	110
రిటైల్:	132
డ్రెస్డ్:	191
స్కిన్‌లెస్:	218

మేళతాళాలు.. పూల జల్లుల మధ్య ఉపాధ్యాయులకు వీడ్కోలు



నర్సింహులపేట, న్యూస్‌టుడే: బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు మేళతాళాలు మధ్య పూలు చల్లుతూ, కోలాటాలు వేస్తూ ఆనందోత్సాహాల మధ్య వీడ్కోలు, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు నర్సింహులపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు. వారం రోజుల కిందట ఇతర పాఠశాలలకు 18 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. పదకొండేళ్లపాటు తమకు చదువులు చెప్పిన గురువులకు వీడ్కోలు సమావేశంలో పూలమాలలు వేసి శాలువా, జ్ఞాపికలతో సన్మానించి కన్నీరుమున్నీరయ్యారు. ఇటీవల పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నర్సిరెడ్డి, పూర్వ ప్రిన్సిపల్ ఆనంద్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెమీస్ చేరిన నల్గొండ, మహబూబ్‌నగర్ జట్లు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో నల్గొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల జట్లు సెమీస్‌కు చేరాయి. సోమవారం కోమటిపల్లి మైదానంలో వరంగల్, నల్గొండ జట్ల మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు 16.5 ఓవర్లలో 52 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఛేదనలో నల్గొండ జట్టు 19 ఓవర్లలో 53 పరుగులు చేసి విజయం సాధించింది. నల్గొండ బౌలర్లలో యశ్వంత్ 4 వికెట్లు, శ్రీకర్ 3 వికెట్లు పడగొట్టి విజయంలో కీలకపాత్ర పోషించారు. మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, మెదక్ జట్ల మ్యాచ్ జరిగింది. నిర్ణీత 50 ఓవర్లలో మహబూబ్‌నగర్ జట్టు మూడు వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. అభిలాష్ 66 పరుగులు, అబ్దుల్ 54 పరుగులు చేశారు. తర్వాత బాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌట్ అయ్యింది. మంగళవారం నుంచి పూల్ 'బీ'లోని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపిక

అడ్డంకిగా మారిన పేదరికం



ప్రతిభకు అవయవలోపం, పేదరికం అడ్డుకాదని నిరూపించారు పలిమెల మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి.. అయిదేళ్ల వయసున్నప్పుడే రోడ్డు ప్రమాదంలో కుడి కాలు కోల్పోయారు. ప్లాస్టిక్ కాలు సాయంతో నడుస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఇంటర్ చదువుతున్న సమయంలో జేఎన్ స్టేడియంలో జరిగిన పోటీలను చూసి క్రీడల్లో ఆసక్తి పెంచుకున్నారు. సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ త్రోబాల్ పోటీల్లో పాల్గొని పసిడి పతకాలు సాధించి జాతీయ స్థాయి ఆటలకు ఎంపికయ్యారు. సెప్టెంబరు 22 నుంచి 26 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆడి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. అంతర్జాతీయ స్థాయి పారా త్రోబాల్ విభాగంలో ఎంపికయ్యారు. డిసెంబరులో కంబోడియా దేశంలో జరిగే అంతర్జాతీయ ఆటల్లో పాల్గొనేందుకు రూ.లక్ష ఖర్చవుతుందని, అక్టోబరు 15లోపు రూ.50,000 చెల్లిస్తేనే అర్హత పొందుతానని ఆమె తెలిపారు. జ్యోతి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో రూ.లక్ష సమకూర్చడం భారంగా మారింది. దాతలు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పలిమెల(భూపాలపల్లి జిల్లా)

వరికి సుడిదోమ 'పోటు'!



న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరి పంటకు సుడిదోమ సోకి తీవ్రంగా నష్టపరుస్తోంది. ఈ సారి 7.50 లక్షల ఎకరాల్లో సాగైనట్లు అంచనా.. ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. భారీ వర్షాల తర్వాత వాతావరణం ఉక్కపోతగా మారడంతో సుడిదోమ ఉద్ధృతి పెరిగినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మామునూరు కృషి విజ్ఞానకేంద్రం కీటక శాస్త్రవేత్త డా. రాజు, వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి కె. అనురాధ రైతులకు సూచించారు. 'పొలాల్లో నీటిపై భాగంలో దోమలు తేలుతూ మొదళ్ల చుట్టూ తిరుగుతూ రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. మొక్క సుడులుగా ఎండిపోతుంది. పొట్ట దశలో ఉద్ధృతి ఎక్కువైతే గింజరాదు. నూక శాతం పెరిగి దిగుబడి పడిపోతుంది. పొలాల్లో తూర్పు, పడమర దిశగా రెండు మీటర్ల దూరంగా పాయలు ఏర్పాటు చేస్తే పంటకు గాలి, వెలుతురు సోకి దోమ ఉద్ధృతి తగ్గుతుంది. పొలంలో నీరు పెడుతూ తీసివేస్తే గుడ్లు, పిల్ల దోమల ఉద్ధృతి తగ్గుతుంది. దోమ కనిపించిన మొదటి దశలో వేపనూనె 1500 పీపీఎం 5 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేయాలి. తర్వాత దశలో ట్రైఫ్లుమిజోపైరిమ్ మందును 94 మి.లీ ఎకరానికి పిచికారీ చేయాలి. దోమ ఉద్ధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 1.5 గ్రా. ఎసిఫేట్ 75 ఎస్.పి కలిపి వరి మొదళ్లపై పడేలా పిచికారీ చేయాలి. అప్పటికీ నివారణ కాకపోతే లీటరు నీటికి 0.4 గ్రా. డైనోటెఫ్యూరాన్ 20 ఎస్‌జి లేదా 0.60 గ్రా పైమెట్రోజిన్ 50 డబ్ల్యూజి లేదా ట్రైఫ్లూమోజోపైరిమ్ 0.485 మి.లీ కలిపి పిచికారీ చేయాలి. పొట్ట దశలో యూరియాతో పాటు పొటాష్ కలిపి వేసుకుంటే మొక్కకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని' వివరించారు.



దోమ ఉద్ధృతిని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త డా.రాజు

రైతేరాజు

ఉల్లిసాగుకు సమయమిదే...

మకోసం



డా.రాజు,శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు.

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే : ఉల్లికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వినియోగం పెరగడంతో ధరలు కూడా నిలకడగా ఉంటున్నాయి. సాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే.. లాభాలు గడించవచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.రాజు తెలిపారు. 'వర్షాకాలంలో నవంబర్‌లోగా విత్తుకునే అవకాశం ఉంది. ఉల్లి సాగుకు ఎకరాకు మూడు, నాలుగు కిలోల విత్తనాలు అవసరమవుతాయి. నేలను బాగా దున్ని 120 సెం.మీ వెడల్పు, 3 మీటర్ల పొడవైన నారుమళ్లను తయారు చేసుకోవాలి. రెండు కిలోల విత్తనం 200 చ.మీ.ల నారుమడికి సరిపోతుంది. విత్తనశుద్ధి చేయాలి. మూడు గ్రాముల కాప్టాన్ లేదా థైరామ్ కిలో విత్తనానికి కలిపి నారుమడిలో పలచగా వరుసల్లో పోయాలి. నారుకుళ్ల తెగులు సోకకుండా పది రోజులకోసారి కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు పురుగు ఆశించకుండా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు నారుమడిలో చల్లి నీరు కట్టాలి. నాటిన 75 రోజుల తర్వాత మాలిక్ హైడ్రజైడ్ 2.5 గ్రా. లీటరు నీటికి ద్రావణాన్ని చల్లడం వల్ల మొలక నష్టం బాగా తగ్గుతుంది. నారునాటిన వంద రోజులకు కార్బండిజమ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే కుళ్లడం చాలా వరకు తగ్గుతుంది. ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 80 కిలోల నత్రజని, 30 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. వేరుశనగ పిండి లేదా ఆముదపు పిండి వేసి, మట్టిని ఎగదోయడం వల్ల ఎక్కువ దిగుబడి వస్తుంది. నత్రజనిని రెండు దఫాలుగా వేసుకుంటే గడ్డ బాగా ఊరుతుంది. నాటిన 60 రోజుల వరకు 15 రోజుల వ్యవధిలో నాలుగు, అయిదు తడులు ఇవ్వాలి. గడ్డ ఊరే దశలో ఏడు రోజుల వ్యవధిలో ఏడు, ఎనిమిది తడులివ్వాలి. కోతకు 15 రోజుల ముందుగా నీరు కట్టడం ఆపాలి. వానాకాలం ఎకరానికి 80 నుంచి 100 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. యాసంగిలో 130 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని' వివరించారు.



దేవన్నపేటలో సాగుచేసిన ఉల్లి

ప్రశ్న-సమాధానం

? మిరప పంటలో తామర పురుగుల నివారణ చర్యలు తెలపండి..? -వి.బుచ్చిరెడ్డి. దేవన్నపేట

✔ తామర పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చడంతో పైకి ముడుచుకుంటాయి. దీన్ని నివారించడానికి నాటిన 15, 45, రోజులకు ఎకరాకు 8 కిలోల ఫిప్రోనిల్ గుళికలు తగినంత తేమ ఉన్నప్పుడు వేయాలి. అవసరాన్ని బట్టి ఎసిఫేట్ 1.5 గ్రా. డైమిథియేట్ 2 మి.లీ. లేదా క్లోరోఫైరిఫాస్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


-తిరుపతి, ఉద్యానశాఖ అధికారి, వరంగల్



తామర పురుగులు ఆశించడంతో ముడుచుకుపోయిన మిరప మొక్కలు

–న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం


గులాబీ.. లాభాల గుబాళింపు





చక్రధర్‌రావు

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే : మెట్ట ప్రాంతంలో గులాబీ తోట సాగుచేసి కొంత మంది కూలీలకు ఉపాధి కల్పిస్తూ లాభాలు పొందుతున్నారు. మండంలోనే గులాబీ తోట సాగు చేసి ఆదర్శంగా నిలిచారు.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిర్లపల్లి గ్రామానికి చెందిన రైతు తూముల చక్రధర్‌రావు సుమారు పదేళ్ల కిందట హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం జీల్గుల గ్రామంలో రెండెకరాల భూమి కొనుగోలు చేశారు. అందులో వ్యవసాయం చేస్తున్నాడు. ఎకరంలో వరి, పత్తి సాగు చేశాడు. మిగతా ఎకరంలో సుమారు రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టి ఏడాది క్రితం గులాబీ తోట సాగు చేశారు. నెల నుంచి పువ్వులు దిగుబడి తీస్తున్నారు. వారంలో రెండు సార్లు కోసి విక్రయిస్తున్నారు. చెట్లకు మూడు రోజులకోసారి 40 నుంచి 50 కిలోల పూలు పూస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.80 నుంచి రూ.100 వరకు ధర ఉంది. తోట వద్దకు వచ్చేవారికి రూ.100కు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. రైతు చక్రధర్ మాట్లాడుతూ... నెల రోజులుగా పూలు పూస్తున్నాయి. పండగల వేళల్లో ధర ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయాధికారుల సూచన మేరకు సస్యరక్షణ చేపడుతున్నాం.. మొక్కలకు దిగుబడి అనంతరం కొమ్మల కత్తిరింపు చేపడుతూ.. పదేళ్ల వరకు పూల దిగుబడి పొందవచ్చని వివరించారు.



అర్జీదారుల వేదన.. అరణ్య రోదన

జిల్లాలో 614 అపరిష్కృత దరఖాస్తులు

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణి అర్జీల పరిష్కారంపై అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. జిల్లాలో సోమవారం వరకు 614 ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోక వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉండటమే అందుకు నిదర్శనం. మరోవైపు అధికారులు సమయపాలన పాటించకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగాల్సిన ప్రజావాణికి అధికారులు సకాలంలో రాలేదు. జిల్లా పాలనాధికారి ఉదయం 10.30 గంటలకే కలెక్టరేట్ సమావేశ మందిరానికి చేరుకోగా.. అధికారులెవరూ కనిపించకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఆ తర్వాత కలెక్టరేట్‌కు చేరుకున్న అర్జీదారులు మాత్రం బారులుతీరి కనిపించారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో మొత్తం 108 అర్జీలను పాలనాధికారి డా.సత్యశారద స్వీకరించారు. వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలే 53 వరకు ఉన్నట్లు వెల్లడించారు.



సోమవారం అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా పాలనాధికారి డా.సత్యశారద

పింఛను మంజూరు చేసి ఆదుకోరూ..!

రామన్నపేటకు చెందిన తమ్మెన మోహన్ రావు ఆటో నడుపుతూ.. కుటుంబాన్ని పోషించుకునేవారు. రెండేళ్ల క్రితం పక్షవాతం వ్యాధి కారణంగా.. కుడికాలు తొలగించారు. ఒంటికాలితో ఆటో నడపలేని పరిస్థితుల్లో ఇంటికే పరిమితమయ్యారు. భార్య కళ్యాణి ఇతరుల ఇళ్లలో వంట పని చేసుకుంటూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు. దివ్యాంగ పింఛను మంజూరు చేసి తమను ఆదుకోవాలని పాలనాధికారిని కలిసి వేడుకున్నారు.



ఆదరిస్తాడనుకుంటే..

చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుడి పేరు జగ్గు. వర్ధన్నపేట మండలం డీసీ తండా నివాసి. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మగ సంతానం లేకపోవడంతో అన్న కుమారుడిని దత్తత తీసుకున్నారు. ప్రస్తుతం వృద్ధుడి పేరుపై ఉన్న 1ఎకరం వ్యవసాయ భూమిని ఆయన అనుమతి లేకుండా దత్తపుత్రుడు తన పేరుపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. వృద్ధులైన తమను పట్టించుకోవడం లేదని కుమారుడిపై చర్యలు తీసుకోవాలని పాలనాధికారికి ఫిర్యాదు చేశారు.



ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరేమి?

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వారానికి ఒక్కసారైనా మా సమస్యలు విన్నవించుకుందామని వస్తే, పదులసార్లు ఫిర్యాదులు చేసినా.. సమస్యలు పరిష్కరించడం లేదని పలు కాలనీల ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్‌కు సమస్యలు చెప్పేందుకు వెళ్తుంటే కొందరు దిగువస్థాయి అధికారులు అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. సోమవారం బల్దియా సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణికి 76 అర్జీలు వచ్చాయి. అందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించినవి 21, ప్రజారోగ్యం 10, పన్నుల శాఖవి 5, టౌన్‌ప్లానింగ్ 40, వీధి దీపాలపై ఒక అర్జీ వచ్చినట్లు అధికారులు తెలిపారు. కమిషనర్ డా.అశ్విని తానాజీ వినతులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయాలని కమిషనర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అన్ని విభాగాల వింగ్ అధికారులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న మహిళలు

డివిజన్ల వారీగా ఇబ్బందులు..

వరంగల్ ప్రాంతం: ● 11వ డివిజన్ పోచమ్మమైదాన్ దేశాయిపేట శ్మశానవాటిక వద్ద డంపింగ్ యార్డు ఎత్తివేయాలి. ● 12వ డివిజన్ స్నేహనగర్ రోడ్-12లో రహదారి ఆక్రమించారు. ● వరంగల్ సూర్యోదయ కాలనీ ఇంటి నంబరు 23-6-18/17 వద్ద ఖాళీ స్థలంలో నీరు నిలిచి, దోమల బెడద ఎక్కువైంది. ● 29వ డివిజన్ పాపయ్యపేట కాలనీలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. ● వరంగల్ బట్టలబజారు ఆర్వోబీ పైన వీధిదీపాలు వెలిగేలా చూడాలి. ● కరీమాబాద్ స్మార్ట్ రోడ్డు పనులు తొందరగా పూర్తి చేసి, దసరా ఉత్సవాలకు ఇబ్బంది లేకుండా చూడాలని దరఖాస్తులు అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99635 59929
98484 09191
99896 42307
97053 46535
(10 AM TO 1 PM)

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



సంగెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక చేయూతను అందిపుచ్చుకొని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం సంగెంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మంచి నీటి సరఫరా సహాయకుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తాగునీటి సరఫరాలో సహాయకులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. శాంతి మండల సమాఖ్యలో నిర్వహించిన వార్షిక మహాసభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, ఏపీఎం కిషన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కల్యాణి పాల్గొన్నారు.

గీసుకొండ: ఊకల్ సొసైటీలో రుణాలపై 12 శాతం వడ్డీ వసూలు చేయడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. గీసుకొండ మండలం ఊకల్ సొసైటీ మహాజనసభను సంఘం అధ్యక్షుడు బొమ్మల రమేష్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణమాఫీ రాని రైతులకు రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు.



బండౌతాపురంలో తాగునీటి కటకట

వర్ధన్నపేట మండలం బండౌతాపురంలో అయిదు రోజులుగా భగరీథ నీరు రావడం లేదు. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు సమస్యను చెప్పినా.. పట్టించుకోవడం లేదని వాపోయారు. పైపులైన్ మరమ్మతులు ఉంటే అధికారులు స్థానికంగా ఉన్న బోర్ల నుంచి గ్రామంలోని కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, వర్ధన్నపేట

‘మాదిగలను కించపరిస్తే ఊరుకునేది లేదు’



వర్ధన్నపేట ర్యాలీగా వెళ్తున్న మాదిగ జేఏసీ నేతలు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాదిగలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను సహించేది లేదని మాదిగ జేఏసీ నేతలు మిద్దెపాక రవీందర్, కుమారస్వామి, సత్యం, సురేఖ పేర్కొన్నారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో సోమవారం మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాగరాజు వ్యాఖ్యలకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓ వేడుకల మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. వెంటనే ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాదిగలకు క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రాజకీయ, దళిత సంఘాల నేతలు శ్రీకాంత్, శివప్రసాద్, వలందాస్ కుమార్, చంద్రమౌళి, రాములు, రాజు, రవికుమార్, మహేశ్, శంకర్, సహదేవ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రక్షణ చట్టాన్ని అమలు చేయాలి



కలెక్టరేట్ ముందు జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఇటీవల కాలంలో న్యాయవాదులపై భౌతికపరమైన దాడులు, బెదిరింపులు ఎక్కువయ్యాయని, వాటిని నియంత్రించేందుకు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో పాలనాధికారి డా.సత్యశారదకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పొడాల సుదర్శన్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

చేపల వ్యాధులపై శిక్షణ

మామునూరు, న్యూస్‌టుడే: మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంతో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ సౌజన్యంతో రెండో విడత చేపల వ్యాధుల నిర్ధారణ, ఆరోగ్య యాజమాన్యంపై అయిదురోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డా.రాజన్న ప్రారంభించారు. రాష్ట్రంలో చేపల పెంపకం ప్రాముఖ్యాన్ని రైతులకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు రవీందర్, గణేష్, సౌమ్య, రాజు, శశాంక్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

మట్టెవాడ, న్యూస్‌టుడే: నగరంలోని ట్రాఫిక్ సమస్యలపై ఈనాడులో ‘సీకేఎం దారిలో ట్రాఫిక్ పద్మవ్యూహం’ శీర్షికన ప్రచురితమైన చిత్ర వార్తకు స్పందన లభించింది. వరంగల్ ట్రాఫిక్ ఠాణా సీఐ రామకృష్ణ స్పందించారు. సీకేఎం ఆసుపత్రి మార్గంలో ఉన్న దుకాణదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీకేఎం ఆసుపత్రికి రాకపోకలు సాగించే అంబులెన్స్, ఇతర అత్యవసర వాహనాలకు ఇబ్బంది కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి శేఖర్‌రావుకు మద్దతు

రంగశాయిపేట, న్యూస్‌టుడే: మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి ట్రస్మా రాష్ట్ర సలహాదారులు యాదగిరి శేఖర్‌రావుకు నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలయెన్స్(నిసా) సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు జాతీయ అధ్యక్షుడు కుల భూషణ్‌శర్మ పేర్కొన్నారు. సోమవారం రంగశాయిపేట శివారులోని ఓ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మద్దతు పత్రాన్ని నిసా జాతీయ ఉపాధ్యక్షుడు జేఎస్ పరంజ్యోతి వడుప్సా జిల్లా అధ్యక్షులు అంకటి వీరస్వామికి అందజేశారు.

బతుకమ్మ గద్దె కూల్చివేత

గీసుకొండ, న్యూస్‌టుడే: ఖిలా వరంగల్ మండలం దూపకుంటలోని చెరువుకట్టపై బతుకమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు గ్రామస్థులు గద్దెను నిర్మించారు. గ్రామానికి చెందిన అనిశెట్టి రంజిత్ సోమవారం జేసీబీతో గద్దెను కూల్చివేయడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీబీసీ చర్చి ప్రారంభ వేడుకలు

లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: వరంగల్ క్రిస్టియన్ కాలనీలో పాత చర్చిస్థానంలో నిర్మించిన సెంటినరీ బాప్టిస్టు నూతన చర్చిని రాజమండ్రికి చెందిన మత ప్రబోధకుడు జాన్‌వెస్లీ బృందం మంగళవారం ప్రారంభించనున్నారు.



మూడురోజుల పాటు నిర్వహించనున్న వేడుకలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించారు. చర్చి కమిటీ అధ్యక్షుడు పీఆర్ సాల్మన్, కార్యదర్శి కొల్లూరి రాజ్‌కుమార్ కమిటీ సభ్యులందరూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ వేడుకల ఖర్చుల కోసం మంత్రి కొండా సురేఖ పంపించిన రూ.5 లక్షల చెక్కును స్థానిక కార్పొరేటర్ వస్కుల బాబు బృందం కమిటీ ప్రతినిధులకు అందించారు.

పోలీసుల నిర్బంధ తనిఖీలు

జాన్‌పాక(గీసుకొండ), న్యూస్‌టుడే: గీసుకొండ మండలం గొర్రెకుంటలో సోమవారం రాత్రి మామునూర్ ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో పోలీసులు నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని రూ.24,500 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తగిన పత్రాలు లేని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గీసుకొండ, మామునూరు, పర్వతగిరి సీఐలు బాబులాల్, రాఘవేందర్, రాజగోపాల్‌గౌడ్, ఎస్సైలు షేక్‌జానీపాషా, కుమార్, ప్రవీణ్‌కుమార్, శ్రీను, కృష్ణవేణి పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి సారించండి



సూచనలు చేస్తున్న మోహన్

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: మహిళలు స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించి ఆర్థికంగా స్థిరపడాలని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వశాఖ సలహాదారు డా.పోలెపాక మోహన్ సూచించారు. సోమవారం 36వ డివిజన్ చింతల్‌లో ఆడెపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి మహిళా పోషకాహారాన్ని స్వయంగా తయారు చేసి కుటుంబానికి వడ్డిస్తుందని, అలాంటి స్ఫూర్తి కలిగినవారు ఆహార శుద్ధి రంగంలోకి ప్రవేశిస్తే సామాజిక ఆరోగ్య ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. ఆహార శుద్ధి రంగంలో అనుసరించాల్సిన మెలకువలు వివరించారు. అనంతరం ఆదర్శ మహిళా సంఘాల సభ్యులు, వైద్యులను ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటేష్ సన్మానించారు.

పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు



విజేతలుగా నిలిచిన జట్లతో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఉపాధ్యాయులు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: పట్టుదలతో సాధన చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, దానికి నేనే ఒక ఉదాహరణ అని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. వర్ధన్నపేట మండలం కట్ర్యాల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన జోనల్ ఎస్‌జీఎఫ్‌ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) క్రీడల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై దృష్టి సారించాలన్నారు. కల్లెడ గ్రామానికి చెందిన పారా ఒలింపిక్స్ కాంస్య పతక విజేత జీవాంజి దీప్తిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ‘నేను కూడా చిన్నతనంలో డాక్టర్ అవుదామనుకున్నా.. కానీ! గురువు కొమురెల్లి అండతో జాతీయస్థాయి హాకీ క్రీడాకారుడిగా ఎదిగినట్లు’ వివరించారు. తర్వాత ఎస్సై నుంచి ఐపీఎస్ వరకు అనంతరం ఎమ్మెల్యేగా మారినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ శ్రీధర్, ఎస్‌జీఎఫ్ఐ జోనల్ కార్యదర్శి సోమన్న, కేతమ్మ, వెంకటేశ్వర్లు, రఘువీర్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



శ్రీనివాస్ (పాతచిత్రం)

నెక్కొండ, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నెక్కొండలో జరిగింది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండకు చెందిన కందకట్ల శ్రీనివాస్(47) ఆటో మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

నగరంలో గొలుసు దొంగతనం

కొత్తవాడ, న్యూస్‌టుడే: నగరంలో గొలుసు దొంగతనం కలకలం సృష్టించింది. మట్టెవాడ ఠాణా సీఐ గోపీరెడ్డి కథనం ప్రకారం.. భద్రకాళి దేవాలయానికి వెళ్లే మార్గంలో సరస్వతి గుడి వద్ద అదే ప్రాంతానికి చెందిన స్వప్న అనే మహిళ పూల దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి దుకాణంలో ఉన్న మహిళ మెడలో నుంచి రూ.50 వేల విలువైన 10గ్రాముల బంగారు పుస్తెల తాడు లాక్కెళ్లారు. వెంటనే తేరుకున్న మహిళ డయల్ 100కు ఫోన్ చేయగా.. మట్టెవాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించగా.. దొంగలు కాపువాడ వైపు వెళ్లినట్లు గుర్తించారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదే ప్రాంతంలో నిత్యం గొలుసు దొంగతనాలు జరగడంపై పోలీసు ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఏడేళ్ల బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం

ఖానాపురం, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు ఆదివారం అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను వృద్ధుడు సమీపంలోని పాఠశాలలోకి తీసుకెళ్లాడు. ఓ మహిళ దీన్ని గమనించి బాలిక కుటుంబ సభ్యులకు చెప్పడంతో వెలుగులోకి వచ్చింది. దుగ్గొండి సీఐ సాయిరమణ, ఎస్సై రఘుపతి సోమవారం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. వృద్ధుడిపై అపహరణ, అత్యాచారయత్నం, పోక్సో కేసులు నమోదు చేసినట్లు సమాచారం

11 మందిపై కేసు నమోదు

ఖానాపురం, న్యూస్‌టుడే: అశోక్‌నగర్‌కు చెందిన మహేందర్ కుటుంబంపై ఆదివారం వెంకన్న, ఆయన కుటుంబ సభ్యులు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆదివారం రాత్రి విచారణ చేసి 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

మండల విద్యాశాఖ అధికారులకు సత్కారం



మట్టెవాడ, న్యూస్‌టుడే: వరంగల్, ఖిలావరంగల్ మండలాలకు చెందిన విద్యాశాఖ అధికారులను రాష్ట్ర, వరంగల్ జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం(వడుప్సా) ప్రతినిధులు కలిశారు. సోమవారం మట్టెవాడలోని ఎంఈఓ కార్యాలయంలో వరంగల్, ఖిలావరంగల్ మండలాలకు చెందిన విద్యాశాఖ అధికారులు గంప అశోక్‌కుమార్, ప్రసాద్‌లను కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కనకయ్య, విలియమ్స్, సుధీర్, విద్యాసాగర్, సురేష్, నజీర్, ఉస్మాన్, వెంకటేశ్వరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు

దుగ్గొండి, న్యూస్‌టుడే: దుగ్గొండిలోని ఆదర్శవాణి ఉన్నత, స్పార్క్ టెక్నో పాఠశాలల్లో సోమవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు పూలతో బతుకమ్మలను సుందరంగా తీర్చిదిద్దారు. వీధుల్లో ప్రదర్శనగా వెళ్లారు. పాఠశాల ఆవరణలో బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఆదర్శవాణి ఉన్నతపాఠశాల ఛైర్మన్ నాగనబోయిన రవి, డైరెక్టర్ భిక్షపతి, ప్రిన్సిపల్ మణికంఠ, స్పార్క్ టెక్నో పాఠశాల డైరెక్టర్ రవికుమార్, ప్రిన్సిపల్ అనిత తదితరులు పాల్గొన్నారు.



దుగ్గొండిలోని ఆదర్శవాణి పాఠశాలలో...



వరంగల్ దేశాయిపేటలో..

రామన్నపేట: వరంగల్ ప్రాంతంలోని దేశాయిపేట, కాశీబుగ్గ, లేబర్ కాలనీ, ఖిలావరంగల్, ఉర్సు, కరీమాబాద్, రామన్నపేట, పాపయ్యపేట తదితర కాలనీల్లో సోమవారం సాయంత్రం బొడ్డెమ్మ ఆడారు. 12వ డివిజన్ కార్పొరేటర్ కావేటి కవిత, కిన్నెరసాని సుగుణ ఆధ్వర్యంలో మహిళలు, చిన్న పిల్లలు కోలాటం ఆడి.. సందడి చేశారు.

పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

ఖానాపురం,న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై ప్రభుత్వం శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి వేములపల్లి సుబ్బారావు పాఠశాల విద్యార్థులకు అభ్యసన సామగ్రిని అందజేశారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన భవనాలు, ప్రయోగశాలలకు నిధులు ఇస్తామన్నారు. మంగళవారిపేట పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి నిధులివ్వాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ హరిబాబు, కౌన్సిలర్ రాజేందర్, నేతలు వెంకటప్రసాదరావు, ప్రధానోపాధ్యాయిని విజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమి పరిశీలన



నెక్కొండ: స్థానిక హనుమాన్ బజారులోని వివాదాస్పద భూమిని సోమవారం ఆర్ఐ నరేందర్, పంచాయతీ కార్యదర్శి సదానందం పరిశీలించారు. ఆ స్థలాన్ని ఓ మహిళ వద్ద కొనుగోలు చేశామని, అక్కడున్న మోటబావిని పూడ్చివేసి చదును చేసుకున్నామని, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించలేదని యాదవసంఘం నాయకులు అధికారులకు తెలిపారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై విచారణ

నర్సంపేట: నర్సంపేట మండలం సర్వాపురంలోని ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈవో సారయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు సందర్శించారు. ఆక్రమణకు గురైన పాఠశాల స్థలంపై విచారణ చేపట్టారు. పురపాలక సిబ్బంది కొలతలు తీసుకున్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న అంబటి శ్రీనివాస్

నర్సంపేట: ప్రత్యేక రాష్ట్ర సాధనకు పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెజస రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. నర్సంపేటలోని తెజస కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అక్టోబరు 6న నర్సంపేటలో ఉద్యమకారులతో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తెజస నాయకులు జావిద్, రాంచందర్, రవీందర్, మల్లేశం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక

దుగ్గొండి: దుగ్గొండి మండలం మల్లంపల్లిలోని కస్తూర్బా పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ మంజుల తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో అక్షిత, సిరి, అంజలిలు అండర్ 17, 14 విభాగాల్లో ప్రతిభ కనబరిచారన్నారు. అక్టోబర్ 3 నుంచి 5 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థినులను ప్రిన్సిపల్ మంజుల, వ్యాయామ ఉపాధ్యాయిని లావణ్య అభినందించారు.

వృద్ధుల అనుభవాలు సమాజానికి అవసరం



సన్మానం పొందిన వృద్ధులతో సంఘాల బాధ్యులు

నర్సంపేట: వయోవృద్ధుల అనుభవాలు, సలహాలు, సూచనలు సమాజానికి ఎంతో అవసరమని నర్సంపేట సీఐ రమణమూర్తి అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం వృద్ధుల, విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నర్సంపేటలో సమావేశం నిర్వహించారు. వృద్ధులు గోక చంద్రయ్య, నాడెం సారయ్య, కీసరి నారాయణరెడ్డి, మాదాసి కట్టయ్య, బోయినపెల్లి అండాళమ్మ, అమినాబీలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

నర్సంపేట గ్రామీణం: ప్రజల ఆరోగ్య రక్షణకు పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్, నర్సంపేట ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. నర్సంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 52 మంది రక్త నమూనాలను టీహబ్‌కు పంపించారు. మండల వైద్యాధికారి అరుణ్ చంద్ర, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నెక్కొండ: బంజరుపల్లిలో సోమవారం మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. గూడూరు మండలం గాజులగట్టు శివారు వాంకుడోతుతండాకు చెందిన అజయ్ ఆటోలో అక్రమంగా బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

సురేఖపై ట్రోలింగ్‌ను ఖండించిన మేయర్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహిళలను అగౌరవపర్చడం భారాస నేతలకు అలవాటుగా మారిందని, మంత్రి కొండా సురేఖ మెడలో ఎంపీ రఘునందన్ వేసిన నూలు దండపై కూడా భారాస నేతలు అవమానకరంగా మాట్లాడుతూ.. ట్రోలింగ్ చేయడం దారుణమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వరంగల్ మేయర్ గుండు సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు రాజకీయంగా ఎదుగుతుంటే భారాస నేతలు ఓర్వలేకపోతున్నారని ఆమె మండిపడ్డారు.

ఎరువు కొరతతో రైతుల ఇబ్బందులు

ఖానాపురం, న్యూస్‌టుడే: వరి గింజలు నాణ్యతగా బరువుగా ఉండేందుకు చిరుపొట్ట, పొట్ట దశలో పొటాష్ వేస్తారు. సహకార సంఘాల్లోని ఎరువుల దుకాణాల్లో పొటాష్ అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు దుకాణాల్లో బస్తాకు రూ.500 చొప్పున చెల్లించి తెచ్చుకుంటున్నట్లు రైతులు వాపోయారు. పొటాష్ కోసం రైతులు సహకార సంఘం చుట్టూ తిరుగుతున్నారు.

IN THE COURT OF THE HON'BLE II-ADDL. SENIOR CIVIL JUDGE AT HANUMAKONDA
O.S. No. 52 of 2024
Between:-
Kodati Madhupal and 2 others ...Plaintiffs
AND
Achakatla Kumara Swamy and 10 others ...Defendants
To
DEFENDANT NO.3: Adidala Srinivas Reddy, S/o: A. Samba Reddy, Age: 41 years, Occu: Business, R/o: H.No.1-9-883/1, Nandi Hills, Hunter Road, Hanumakonda.
Please take notice that the plaintiffs have filed the above suit against you and others for grant of Permanent Injunction along with I.A. No.9/2024 for grant of Temporary injunction order against you & others. The above suit and injunction petition in I.A. No.9/2024 is posted **28.10.2024** for your appearance. Therefore you are hereby directed to appear before the Hon'ble court on **28.10.2024 at 10:30 am** failing which the matter will be decided in your absence.
// BY THE ORDER OF THE COURT//
Sd/-, **CH.SWAMYNATHAN**, ADVOCATE
H.NO. 12-1-70, S.V.N.ROAD, WARANGAL
Cell: 9848011373

IN THE COURT OF THE HON'BLE II-ADDL. SENIOR CIVIL JUDGE AT HANUMAKONDA
O.S. No. 53 of 2024
Between :-
Pinninti Vijay Kumar and another ...Plaintiffs
AND
Achakatla Kumara Swamy and 10 others ...Defendants
To
DEFENDANT NO.3: Adidala Srinivas Reddy, S/o: A. Samba Reddy, Age: 41 years, Occu: Business, R/o: H.No.1-9-883/1, Nandi Hills, Hunter Road, Hanumakonda.
Please take notice that the plaintiffs have filed the above suit against you and others for grant of Permanent Injunction along with I.A.. No.10/2024 for grant of Temporary injunction order against you & others. The above suit and injunction petition in I.A. No.10/2024 is posted 28.10.2024 for your appearance. Therefore you are hereby directed to appear before the Hon'ble court on **28.10.2024 at 10:30 am** failing which the matter will be decided in your absence.
// BY THE ORDER OF THE COURT//
Sd/-, **CH.SWAMYNATHAN**, ADVOCATE
H.NO. 12-1-70, S.V.N.ROAD, WARANGAL
Cell: 9848011373